# ఆవిడ చేసిన అల్లరి

"హాస్యప్రియ"

భానుమూర్తి నెలకు మూడు రోజులు ఆఫీసుకు ఆలస్యంగా రావడం కద్దు. అటువంటిది రెండు నెలల నించీ ఆఫీసుకు కరెక్టుగా టైముకి వస్తున్నాడు. అయితే స్వహస్తం తప్పినట్లేనా! ఆ వేళ ఆఫీసుకు రాగానే పట్టుకున్నారు అతని తోటి గుమాస్తాలు, చక్రవర్తి, రాముడు, గంగారావూను.

"ఏమోయ్ భానూ! కంగ్రాచ్యులేషన్సు! కాఫీ ఏదీ?"

"ఎందుకరా! కాఫీ"

'ఎందుకరా కాఫీ'

"ఎందుకేమిటీ! నువ్వు రెండు నెలల్నించీ ఒక్క రోజన్నా ఆలస్యం కాకుండా ఏకబిగిని టైముకి వస్తున్నందుకు"

"అందులో విశేషమేముందీ"

"విశేషం లేకపోవటమేమిటీ! రైలు బళ్లలాంటి లేటు మనిషివి........ నెలకు మూడు రోజులే ననుకో.... యూరోపియన్ పంచుయాలిటి మైన్‌టెయిన్ చేస్తుంటే! మరి స్వహస్తం తప్పినట్లేగా! అందులో ఈ మధ్య నీకు వాంతులు అవుతున్నాయి గూడాను!"

"నాకు వాంతులా! నాకేం ఖర్మం వాంతిజేసుకోటానికి! చిట్టిన చీది గూడ ఎఱుగను"

"నీకు కాకపోతే నీమంచి సగానికి ఇక బాల భానుడుదయించు గాదే!"

"ఆరి మిమ్మల్ని నిలువునా పాతెయ్య! మా ఆంతరంగిక రహస్యాలు మీకెల్లా తెలిసినాయి? ఏమయినా కర్ణపిశాచి .... సరే పదండి హోటలికి"

ఆవేళంతా ఉల్లాసంగా గడిపాడు భానుమూర్తి. సాయంకాలం సినిమాగూడా తప్పలేదు మిత్రులతో! రాత్రి ఆలస్యంగా వచ్చి భోజనంచేసి నిద్రపోయాడు.

* * *

పొద్దున్న లేచేసరికి కాఫీకప్పు ప్రత్యక్షం కాలేదు! కారణం ఏమిటా అని ఆలోచించుకుంటూ హాలులోకి వచ్చేసరికి.... హతవిధీ!.... చింకిచాపమీద సీతామహాలక్ష్మమ్మ ప్రత్యక్షం! (అవిడ అసలు పేరు మనకి తెలియదనుకోండీ)

* * *

ఆ వేళ రుస రుసలాడుకుంటూ ఆలస్యంగా ఆఫీసుకొచ్చిన భానుమూర్తిని జూచి మిత్రులంతా విస్తుపోయారు!

"ఓరి కుక్కల్లారా! కక్కండి నా కాఫీ! అనవసరంగా మోసం చేస్తారా?"

"మేం చేసిన మోసం ఏమిటా!"

ఇంకేం చెయ్యాలి! సర్వనాశనం అయింది! మళ్ళీ నెల నెలా లేటు"

అప్పటికి అర్థమయింది! మిత్రులకు అతని అవస్థ! పాపం! ఏం చేస్తాం? అతని దురవస్థకు విచారించారు!

♦ ♦ ♦

ఆ సాయంకాలం కాళ్ళీడ్చుకుంటూ నీరసంగా యింటికి జేరాడు భానుమూర్తి! మళ్ళీ రాత్రికి పొయ్యిమీద తగలెట్టాలిగా! కాని ఇంటికివచ్చి చూచును గదా! చింకి చాపాలేదు, మహాలక్ష్మమ్మాలేదు ఏమయిందో అనుకుంటూ సోఫాలో కూలబడ్డాడు. ఓపిక చచ్చి.

ఇంతలో వేడివేడి సువాసనలు విరజిమ్ముతున్న ఉల్లిపాయి పకోడీలతో ప్రత్యక్షమయింది భార్య! తాను ఆఫీసుకు వెళ్ళి వచ్చే లోపునే మూడురోజు లయినాయా! ఇదేమీ అంతుపట్టలేదు భానుమూర్తికి!

"ముందు ఇవి తినండి! తర్వాత చెప్తాను! నిన్న మొదటి ఆటకు సినిమాకు తీసుకువెళానన్నారా! పొద్దుపోయేదాకా రాలేదు! అందుకని కోపంవచ్చి మిమ్మల్ని ఏడిపిద్దామని పొద్దున్న నాటకం ఆడాను! కాని మీరు విచారంతో అన్నం తినకుండా వెళ్ళిపోవటంచూసి ఇక ఉండబట్టలేక పోయానండీ!...."

ఇక తర్వాత మాటలు వినబడలేదు సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న భానుమూర్తికి...." బయలుదేరు సినిమాకి వేళయింది."

* * *

"రండిరా కాఫీకి" అంటున్న భానుమూర్తి మాటలు అర్థంకాక తెల్లమొహం వేశారా మిత్రులు మరునాడు ఆఫీసులో!

—o—

## మచిలీపట్నం అంజుమన్ సమావేశం

అంజుమన్ నూరుల్ ఇస్లాం, జబ్బార్ పేట మచిలీపట్నం యొక్క జనరల్ బాడి వార్షిక సమావేశం సదరు అంజుమన్ బిల్డింగ్ నందు ది 21-10-61 న అంజుమన్ ప్రెసిడెంటు జనాబ్ మహమ్మద్ షామియా సాహెబుగారి అధ్యక్షతను జరిగినది. షుమారు 350 మంది సభ్యులు, బెజవాడనుండి రిటైరు D. E. O. జనాబ్ మహబూబ్ అలిసాహెబ్ M. A. L. T. జనాబ్ మిర్జా అసదుల్లా బేగ్ సాహెబు గారు హాజరయినారు. వెనుకటి ప్రెసిడెంటు Dr. S. S. A. Kirmanee Saheb గారు రిజగ్నేషను యిచ్చుటచే వారి స్థానే జనాబ్ మహమ్మద్ షామియా సాహెబుగారిని ప్రెసిడెంటుగా ఎన్నుకొనడ మయినది. మరికొందరు మెంబర్లను ఎన్నుకొనడమయినది. కొన్ని బైలాస్ అమెండ్ చేయబడినవి.

Md. Shah miyan,
President.
21-10-61